రైతులకు రూ.31వేల కోట్ల రుణమాఫీ చేశాం

- మిగిలిన రైతులకు కూడా రుణమాఫీ చేస్తాం
- ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు
- ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి


మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న నర్సింహులు యాదవ్

మేడ్చల్‌రూరల్: దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్నాయని, రూ. 31 వేల కోట్ల నిధులతో రెండు లక్షల రుణాలను మాఫీ చేశామని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని నిమ్మల గార్డెన్స్‌లో నిర్వహించిన మేడ్చల్ మార్కెట్ కమిటీ పాలకవర్గం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కొన్ని సాంకేతిక కారణాలతో పలువురు రైతులకు రుణమాఫీ జరగలేదని, త్వరలోనే అది పూర్తవుతుందన్నారు. రైతులు పండించిన ధాన్యం, పత్తిని కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. రైతులకు మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి ఉత్పత్తులను పెంచాలన్నారు. నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ పాలక వర్గం రైతుల అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సామాజిక ఉద్యమానికి, అభివృద్ధికి, చైతన్యానికి గ్రంథాలయాలు ఎంతో తోడ్పడుతాయని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, సరిత వెంకటేష్, రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

ప్రొటోకాల్ వివాదం.. పార్టీ అధ్యక్షుడు దూరం

మేడ్చల్ మార్కెట్ కమిటీ పాలకవర్గం, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనలేదు. ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ప్రొటోకాల్ పాటించలేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి గైర్హాజరు కావడంతో తన వర్గం నాయకులు సైతం కార్యక్రమంలో పాల్గొనలేదు. మరోవైపు మేడ్చల్‌కు చెందిన వారికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వలేదంటూ మేడ్చల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు అలిగి కార్యక్రమం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. మాజీ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, శ్రీశైలంగౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి సైతం గైర్హాజరయ్యారు.

ప్రగతి చక్రాల పురస్కారాల అందజేత


పురస్కారాలతో ఆర్టీసీ ఉద్యోగులు

మేడ్చల్: అక్టోబర్ నెలలో మేడ్చల్ ఆర్టీసీ డిపోలో ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు యాజమాన్యం ప్రగతి చక్రాల పురస్కారాలను అందజేసింది. డిపో మేనేజర్ సుధాకర్ ఇతర అధికారులు ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు, మెకానిక్‌లకు సన్మానం నిర్వహించి పురస్కారాలను అందజేశారు. సమావేశంలో డిపో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయ భవనం ప్రారంభం



మేడ్చల్: మేడ్చల్ శివార్లలో నూతనంగా నిర్మించిన మేడ్చల్ మార్కెట్ కమిటీ కార్యాలయ భవనంను ఎమ్మెల్సీ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ధృవ కళాశాల సమీపంలో రెండు కోట్ల 34 లక్షల వ్యయంతో భవనం నిర్మించగా.. కార్యాలయంను ఎమెల్సీ ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, సీనియర్ నేత ప్రభాకర్‌గౌడ్ వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం


కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

మేడ్చల్: వివిధ కేసుల్లో పట్టుబడ్డ 16 వాహనాలను అధికారులు మేడ్చల్ ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం వేలం వేశారు. వేలంలో ఉంచిన 16 వాహనాల అఫిడవిట్ ధర రూ. 4,21,100 ఉండగా రూ. 5,25,843 కు వివిధ వ్యక్తులు వేలం పాటలో పాల్గొని దక్కించుకున్నారు. మిగిలిన వాహనాలకు మరొక తేదిన వేలం నిర్వహిస్తామని సీఐ నవనీత తెలిపారు.

అభినందనలు



ఘట్‌కేసర్: మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన నర్సింహులు యాదవ్‌ను, మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజుముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

భూ వివాదంపై సర్వే


లేఅవుట్ పత్రాలను పరిశీలిస్తున్న లోకాయుక్త అధికారులు

పోచారం: నారపల్లిలోని సర్వే నెంబర్ 27లో 5 ఎకరాల 3 గుంటల విస్తీర్ణంలో చేసిన లేఅవుట్‌లో తన ప్లాటు ఆక్రమణకు గురైందని లోకాయుక్తలో మల్లేష్ ఫిర్యాదు చేశాడు. దీంతో లోకాయుక్త, పోచారం మున్సిపల్ పట్టణ విభాగం, పోలీస్, రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించి సర్వే చేపట్టారు. లేఅవుట్‌కు ఆనుకొని ఉన్న 50 అడుగుల వెడల్పు గల రోడ్డు 5 ఎకరాల 3 గుంటల్లో వస్తుందని కొందరు వ్యక్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డును వదిలేసి 5 ఎకరాల 3 గుంటలకు కొలతలు తీసుకోవాలని మల్లేష్ కోరడం జరిగింది. వాస్తవాలను పరిశీలించి నివేదిక రూపొందిస్తామని లోకాయుక్త అధికారులు వెల్లడించారు. గతంలో ఇదే భూమికి నిర్వహించిన సర్వేను కూడా పరిశీలిస్తామన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



మేడ్చల్: మేడ్చల్‌లో మంగళవారం మంత్రుల పర్యటన నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. మంగళవారం ఉదయం నాయకుల వద్దకు వెళ్లిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సాయంత్రం విడిచి పెట్టారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు భాస్కర్‌యాదవ్, నవీన్‌రెడ్డి, అలీ తదితరులు ఉన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు



మేడ్చల్: రాష్ట్రంలో ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో కళాకారులు కళాజాతర నిర్వహించారు. కళాకారులు తమ సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రజా పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరించారు. మండలంలోని శ్రీరంగవరం, బండమాదారం, రాయిలాపూర్ నూతన్‌కల్ తదితర గ్రామాల్లో కళాజాత నిర్వహించారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతాలు

కీసర: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి సన్నిధిలో మంగళవారం ఏకాదశి సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం కీసరగుట్టలో హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ పద్మావతి బృందం వారు దేవాలయ మండపంలో వీణా వాయిద్యం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కీసర: అహ్మద్‌గూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఆర్‌జీకే అహ్మద్‌గూడ ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా నేడు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆర్‌కెజీకాలనీ, హరిదాస్‌పల్లి, సింధు వనంకాలనీ, గురుకుల్ పాఠశాల ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని నాగారం విద్యుత్ ఏఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కీసరలో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్దమ్మ చెరువు ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అంకిరెడ్డిపల్లి, బీసీ వెల్ఫేర్ స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

పోచారంలో..

విద్యుత్ వైర్లకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నారపల్లిలోని సప్తగిరికాలనీ, రేవతి రైస్‌మిల్, వీకర్ సెక్షన్ కాలనీ, అంజనీ స్కూల్ ప్రాంతాలకు కరెంట్ ఉండదని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు.


హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవంలో చైర్‌పర్సన్

అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నాం

మేడ్చల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కలిపిస్తూ అన్నీ విధాల అభివృద్ధి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని 14వ వార్డులోని వెంకట్రామయ్య కాలనీలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలోని 23 వార్డులలో ప్రజలకు కావాల్సిన వీధి దీపాలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు వంటి పనులు 90శాతం మేర పూర్తి చేశామన్నారు. లక్షల రూపాయల నిధులు వెచ్చించి మౌలిక వసతులు కలిపించామని.. మిగతా సౌకర్యాలు కలిపిస్తామన్నారు. సమావేశంలో 13వ వార్డు కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పవన్‌కుమార్, విఠల్, రాజ్‌గోపాల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు

సాక్షి,సిటీబ్యూరో: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రైతులకు వెంటనే డబ్బులు జమ అయ్యేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి కలిసి పాల్గొన్నారు. జిల్లాలో 13 సెంటర్ల నుంచి 1012 మంది రైతుల నుంచి, 357 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. కేంద్రాలలో గన్ని సంచులు, ప్యాడి క్లీనర్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతులకు వెంటనే డబ్బులు జమ అయ్యే విధంగా సంబంధిత జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సన్నరకం ధాన్యానికి బోనస్ డబ్బులు వెంటనే మంజూరు చేయాలన్నారు. రైతు సదస్సులోపు రైతులందరికీ వారి వారి ఖాతాలలో ధాన్యం కొనుగోలు డబ్బులు పడేలా ఆర్థిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులకు అందిస్తున్న సౌకర్యాల గురించి ప్రజలకు చేరే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ ప్రాంతాల నుంచి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండాసురేఖ, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, పౌరసరఫరాల కమిషనర్ చౌహన్ పాల్గొన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా సివిల్ సప్‌లై జీఎం సుగుణాబాయి, వివిధ శాఖల జిల్లా అధికారులు విజయకుమారి, చంద్రకళ, నీరజా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ రాజ్యాంగ నిబంధనలు పాటించాలి

సాక్షి,సిటీబ్యూరో: భారతదేశ రాజ్యాంగం ఎంతో పవిత్రమైందని రాజ్యాంగంలోని నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని, రాజ్యాంగాన్ని గౌరవించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కృషి కారణంగానే భారతదేశం అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిచిందన్నారు. అనంతరం భారత రాజ్యాంగం పట్ల విధేయతతో నడుచుకుంటామని, రాజ్యాంగాన్ని గౌరవిస్తామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓరామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



హీరో సిద్దార్థ్‌ని కలిసిన తైక్వాండో మాస్టర్ రమేష్



జవహర్‌నగర్: హైదరాబాద్‌లోని 'మిస్ యూ' సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం హీరో సిద్దార్థ్‌ని జవహర్‌నగర్‌కి చెందిన తైక్వాండో మాస్టర్ రమేష్ కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం హీరో సిద్దార్థ్ చేసిన సినిమాల గురించి ఆయన అభినందించారు.

ఎన్‌ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడిని కలిసిన నాయకులు


వరుణ్‌చౌదరితో మేడ్చల్ నాయకులు

మేడ్చల్‌రూరల్: ఎన్‌ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరిని మంగళవారం మేడ్చల్ జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షులు రాహుల్‌యాదవ్, నాయకులు కలిశారు. నగరంలోని గాంధీ భవన్‌లో నిర్వహించే సంవిధాన్ దివస్ పాల్గొనేందుకు వచ్చిన ఆయనను తాజ్‌కృష్ణ హోటల్‌లో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో శ్రీధర్, విజయ్, రాంప్రసాద్, అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వైఎఫ్ చిత్ర హీరో జన్మదిన వేడుకలు



మేడ్చల్‌రూరల్: లవ్ యువర్ ఫాదర్ (ఎల్‌వైఎఫ్) చిత్రంలో తెరంగేట్రం చేయబోతున్న హీరో శ్రీహర్ష జన్మదిన వేడుకలు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. హీరో తండ్రి, మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి కుటుంబీకులు, చిత్ర బృందంతో కలిసి కేక్ కట్ చేసి హీరో శ్రీహర్ష తన జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

గ్రంథాలయ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణస్వీకారం



మేడ్చల్: మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియమితులైన బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. మేడ్చల్‌లోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చైర్మన్‌గా ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం హహేందర్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ గ్రంథాలయశాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్‌రూరల్‌లో.. నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


కీసరలో.. రాజ్యాంగ దినోత్సవ వేడుకలు


మేడ్చల్‌లో.. ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి పాఠశాలలో రాజ్యాంగ దివస్ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు రాజ్యాంగం విలువలు, హక్కులు, బాధ్యతలు వంటివి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్, పద్మలత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయురాలు మాధురి పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యత, అంబేడ్కర్ కృషి గురించి ఉపాధ్యాయురాలు మాధురి వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు భార్గవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కీసరలో..

కీసర మండల అంబేడ్కర్ సంఘం కొమ్ము సుదర్శన్ ఆధ్వర్యంలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పెంటయ్య, కుమార్, శంకరయ్య, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..

పట్టణంలో 75వ జాతీయ రాజ్యాంగ దినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాపూర్ సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. ముఖ్యఅతిథిగా చైల్డ్ డవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా యువజన కేంద్రం అధికారి ఐసయ్య, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు, సంస్కృతి కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ హరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.